సాక్షి
తిరుపతి
శనివారం । 6 । మే । 2023



పారిశుద్ధ్యం దారుణమయా!
తిరుపతి రుయా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. - IIలో..



దైవదర్శనానికి వెళ్లి వస్తూ..
తమిళనాడులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తికి చెందిన ముగ్గురు మృతి చెందారు. - IIలో..

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	26
చిత్తూరు	33	25
తిరుమల	28	22
గూడూరు	33	27
నగరి	33	26

న్యూస్‌రీల్‌

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 64,707 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 28,676 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి హుండీ ద్వారా కానుకల రూపంలో రూ.3.98 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది.

నేడు 'పది' ఫలితాలు

తిరుపతి ఎడ్యుకేషన్‌ : పదో తరగతి పరీక్షా ఫలితాలను మంత్రి బొత్సా సత్యనారాయణ శనివారం విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పదోతరగతి పరీక్షలకు 28,413మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు.

గాలీవాన



గూడూరు ఎంపీడీఓ కార్యాలయం ముందు నిలిచిన వర్షపునీరు

గూడూరురూరల్‌: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం పడింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్‌ స్తంభాలు నేలకూలాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గూడూరు ఎంపీడీఓ కార్యాలయం జలమయమైంది. నిమ్మ, బొప్పాయి, మామిడి పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది.

పక్క జెండాలు మోయడంలో దిట్ట పవన్‌

తిరుపతి అర్బన్‌: ఎవరైనా సొంతంగా పార్టీ పెట్టుకుంటే తమకు ఓట్లేయండి, పేద వారికి సాయం చేస్తామని చెప్పడం సాధారణమని, కానీ జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌ పక్క జెండాలు మోస్తూ, ఇతరులను గెలిపించేందుకే ఉబలాటపడుతుంటారని మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. పవన్‌ కల్యాణ్‌ కొంతకాలం నరేంద్రమోదీకి.. మరి కొంతకాలం చంద్రబాబునాయుడుకి ఓట్లేయండని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలో ఆయన కేఏ పాల్‌ పార్టీ జెండాను కూడా మోస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ప్యాకేజీలను తీసుకుని చంద్రబాబునాయుడుకు మద్దతు తెలపడం బాధాకరమన్నారు.


ఆర్టీసీ రూట్‌ ఒప్పందాలపై చర్చ



డీపీటీఓలతో మాట్లాడుతున్న ఈడీలు

తిరుపతి అర్బన్‌ : తమిళనాడుతో రూట్‌ ఒప్పందాలపై ఆర్టీసీ అధికారులు చర్చించారు. శుక్రవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో విజయవాడ, కడప, నెల్లూరు ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, ఆదాం సాహెబ్‌ సమావేశమయ్యారు. ఈ నాలుగు జిల్లాల నుంచి తమిళనాడుకు నడుపుతున్న బస్సు సర్వీసుల వివరాలను తెలుసుకున్నారు. ఏ రూట్‌లో అధిక ఆదాయం వస్తుందనే విషయాన్ని ఆరా తీశారు. ఈ మేరకు డీపీటీఓల నుంచి నివేదికలు స్వీకరించారు. త్వరలోనే తమిళనాడు అధికారులతో చర్చించి రూట్ల వారీగా ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో తిరుపతి డీపీటీఓ చెంగల్‌రెడ్డి, చిత్తూరు డీపీటీఓ జితేంద్రరెడ్డి, అన్నమయ్య డీపీటీఓ రాము, పొట్టి శ్రీరాములు నెల్లూరు డీపీటీఓ శేషయ్య పాల్గొన్నారు

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతంలో అర్చకులు, భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరదరాజుల స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుద్ధపౌర్ణమి సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారిని సత్యనారాయణ స్వామి అలంకరణలో కొలువుదీర్చి వ్రతం నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అమ్మవారి తొలి దర్శనంలో స్వరూపానందేంద్రస్వామి



కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి అనుగ్రహ భాషణం



కలశానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్‌ అభినయ్‌రెడ్డి, అర్చకులు

ఆధ్యాత్మిక శోభతో తిరునగరి ఖ్యాతి ఇనుమడించింది.. వేదమంత్రోచ్ఛారణల నడుమ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం పరిపూర్ణమైంది.. నూతనంగా నిర్మించిన దివ్యాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించడంతో యావత్‌ భక్తకోటి పులకించింది.. మహోత్సవం ముగియగానే వరుణుడు కుంభవృష్టి కురిపించడంతో పరవశించింది.. పుణ్యజలాల జల్లులో తడిసి పునీతమైంది.. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిమాన్విత ఘట్టంలో పీఠాధిపతులు పాలుపంచుకోవడం భక్తులకు నయనానందకరంగా మారింది.

గంగరంగ వైభవం

- పరిపూర్ణం.. మహా కుంభాభిషేకం
- శాస్త్రోక్తంగా తాతయ్యగుంట గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట
- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి చేతులమీదుగా మహోన్నత ఘట్టం
- అమ్మవారి తొలి దర్శనంలో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి

తిరుపతి కల్చరల్‌ : తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మహా కుంభాభిషేక మహోత్సవం చివరి రోజు శుక్రవారం నాడు అమ్మవారి ప్రతిష్ఠతో ఘనంగా ముగిసింది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో అత్యంత వైభవోపేతంగా మహా కుంభాభిషేక మహోత్సవం సాగింది. అనంతాళ్వార్‌ వంశీయులైన 22వ తరానికి చెందిన కస్తూరి రంగన్‌ ఆధ్వర్యంలో ఆరంభమైన కుంభాభిషేకంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది వేద పండితులు పాల్గొన్నారు. గంగమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ సారథ్యంలో ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్విరామంగా వేదపారాయణం, యజ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగో రోజు గురువారం సాయంత్రం గంగమ్మ తల్లి మూలవిరాట్‌ను యాగశాలలో జలాధివాసం చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్‌ భూమన అభినయరెడ్డి వారి కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్‌ కట్టా గోపీయాదవ్‌, ఈఓ ఎం.మునికృష్ణయ్య, ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ కుంభాభిషేక సంబంధిత ప్రధాన కలశం, మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి స్వర్ణ యంత్రాన్ని మంగళవాయిద్యాల నడుమ గర్భాలయానికి ప్రదక్షిణగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు కంచికామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతీ స్వామివారు, మంత్రి ఆర్కే రోజా విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే భూమన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నిర్ణయించిన శుభ పుష్కరాంశంలో జగద్గురువు విజయేంద్ర సరస్వతీ స్వామివారి అమృత హస్తాలతో స్వర్ణ యంత్ర స్థాపన, అమ్మవారి మూలవిరాట్‌ ప్రతిష్ట చేశారు. అమ్మవారికి పవిత్ర జలాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయ విమాన శిఖర కలశ స్థాపన చేశారు. శిఖర కలశానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మంత్రి రోజా భూమన అభినయరెడ్డి కుంభాభిషేకం చేశారు. ఈ క్రమంలోనే మహాకుంభాభిషేకం, అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని తల్లిని తొలి దర్శనం చేసుకునేందుకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతిస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే భూమన ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుంభాభిషేక మహోత్సవం ముగియగానే వరుణుడి కటాక్షంతో వర్షం కురవడం గంగమ్మ తల్లి మహిమేనంటూ భక్తులు పులకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ కట్టా గోపీయాదవ్‌, ఈవో ఎం.మునికృష్ణయ్య, పాలక మండలి సభ్యులు టి.వెంకటేశ్వరరావు, ఎం.హరినాథరెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్‌, వి.కృష్ణమ్మ,వి.గీత, ఎస్‌. భారతి, ఆలయ అర్చకులు, భక్తులు, నగర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహోత్సవంలో పాల్గొన్న వేద పండితులకు ఎమ్మెల్యే భూమన సంభావన అందించారు. పరమ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన



పుణ్యజలాలను ప్రజలపై చల్లుతున్న దృశ్యం



గంగమ్మకు ఇరుముడి చెల్లిస్తున్న భక్తులు

అమ్మవారి అనుగ్రహంతోనే తొలి దర్శనం

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేకంలో భాగంగా ప్రతిష్ఠించిన గంగమ్మ తల్లి మూలవిరాట్‌ను తొలి దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందని, శారదా పీఠాధిపతి స్వరూపానందస్వామి తెలిపారు. గర్భాలయంలో గంగమ్మకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహంతోనే తల్లిని సేవించుకోగలిగామని వెల్లడించారు. ఆధ్యాత్మికత, భక్తి ప్రపత్తులతో పాటు సమాజ హితంపై అభిరుచి కలిగిన భూమన కరుణాకరరెడ్డి అభినందనీయులన్నారు. టీటీడీ చైర్మన్‌గా దళిత గోవిందం వంటి గొప్ప కార్యక్రమాలు చేపట్టారని ప్రశంసించారు. ఆయన సారథ్యంలో గంగమ్మ ఆలయ పునః నిర్మాణం, మహా కుంభాభిషేకం శుభకరమన్నారు.గంగమ్మ ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

సిరులతల్లికి 'స్వర్ణ'తేజం

- వేడుకగా శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు
- శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణరథంపై దర్శనమిస్తున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతిదేవి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువనే మేల్కొల్పి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఉదయం 9.10గంటలకు స్వర్ణరథ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం గోవిందనామ స్మరణ నడుమ శ్రీపద్మావతీదేవిని రథంపై కొలువుదీర్చారు. అమ్మవారు స్వర్ణరథంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం 2.30గంటలకు ఉద్యానవనం మండపంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణ నడుమ పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అర్చకులు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 7.30 గంటలకు సర్వాలంకార శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్‌, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, ఆలయ ఇన్స్‌పెక్టర్‌, సుభాష్‌, ప్రసాద్‌ పాల్గొన్నారు. వసంతోత్సవాల్లో చివరిరోజైన శనివారం అమ్మవారికి స్నపన తిరుమంజనం, తిరుచ్చి వాహనసేవ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

దాసుడిపై దేవదేవుడు



తిరుమలలో శుక్రవారం రాత్రి పౌర్ణమి గరుడ వాహన సేవ అత్యంత వైభవంగా సాగింది. తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ స్వామివారు భక్తులను కటాక్షించారు. – తిరుమల

నయనానందం.. నృసింహుని కల్యాణం

రాపూరు : వేదమంత్రాలు.. మంగళవాయిద్యాలు.. ముత్యాల తలంబ్రాలు.. నమో నారసింహా స్మరణల నడుమ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నయనానందకరంగా సాగింది. శుక్రవారం పెంచలకోనలో దేవదేవేరుల పెళ్లి ఘట్టాన్ని వీక్షించేందుకు వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. ముందుగా ఉదయం 10 గంటలకు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చారు. అనంతరం శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణమండపానికి వేంచేపు చేశారు. వేదపండితులు తొలుత శ్రీవారు, అమ్మవార్లకు భాసికం, కంకణాలు ధరింపజేశారు. విష్వక్సేన పూజ అనంతరం దేవదేవేరుల గోత్రాలు చెప్పి కన్యాదాన కార్యక్రమం నిర్వహించారు. సుముహూర్తంలో మంగళసూత్ర ధారణ జరిపించారు. స్వామివారి కల్యాణం విశిష్టతను వేదపండితులు భక్తులకు వివరించారు. శ్రీవారి కల్యాణాన్ని పురస్కరించుకుని టీటీడీ తరఫున పేషీ అధికారి శ్రీహరి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవుడి పెళ్లి ముహూర్తంలో వేదిక వద్ద పలువురు నూతన వధూవరులు వివాహం చేసుకున్నారు. అనంతరం స్వామివారికి పెద్దసంఖ్యలో భక్తులు కానుకలు చదివించారు. దాదాపు రూ.1.24లక్షలు చదివింపుల రూపంలో వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లతోపాటు ఆంజనేయునికి ప్రత్యేక పూలంగిసేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్‌ చెన్ను తిరుపాల్‌రెడ్డి, దేవదాయశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, ఈఓ జనార్దన్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, దేవుడు వెల్లంపల్లె ఈఓ శ్రీధర్‌, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, పాల్గొన్నారు.



విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు

కనులపండువగా రథోత్సవం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథంపై స్వామివారు ఉభయనాంచారులతో కలిసి కోన తిరువీధుల్లో ఊరేగారు. రాత్రి 10 గంటలకు ఏనుగు అంబారీపై స్వామి, అమ్మవార్లు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

నేడు చక్రస్నానం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం, వసంతోత్సవం, తెప్పోత్సవం, అశ్వవాహనసేవ, ధ్వజావరోహణం నిర్వహించనున్నారు.

సంక్షేమ 'మస్తు'

- పేదలకు అండగా ప్రభుత్వ పథకాలు
- వైఎస్సార్‌ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద 418 మందికి లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ. 3.34 కోట్లు జమ



లబ్ధిదారులకు మెగాచెక్కు అందిస్తున్న మంత్రి రోజా, కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్‌ : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు వరంగా మారాయని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వైఎస్సార్‌ కల్యాణమస్తు, షాదీ తోఫా జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా తాడేపల్లె ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన జంటలు వివాహం చేసుకుంటే, వారికి అండగా నిలిచేందుకు ఈ పథకాలను ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల్లో ఈ పథకం ద్వారా 16,668 మంది వధువుల తల్లుల ఖాతాల్లో రూ. 125.50 కోట్లు జమ చేశామని వెల్లడించారు. జిల్లాలో తాజాగా 418 మంది లబ్ధిదారులకు రూ.3.34 కోట్లు అందించినట్లు వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్‌ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా వైఎస్సార్‌ కల్యాణమస్తు, వైఎస్సార్‌ షాదీ తోఫా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశామని చెప్పారు. ప్రతి త్రైమాసికానికి ఒకసారి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, వధూవరులు వివాహమైన 30 రోజుల లోపు తమ పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కల్యాణమస్తు కింద ఎస్సీలు, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహమైతే రూ.1.20లక్షలు అందిస్తామన్నారు. బీసీలకు రూ. 50వేలు, కులాంతరమైతే రూ. 75వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.1.50లక్షలు, భవన నిర్మాణం, ఇతర కార్మికులకు రూ.40వేలు అందిస్తున్నట్లు వివరించారు. మైనారిటీలకు వైఎస్సార్‌ షాదీ తోఫా కింద రూ.లక్ష అందజేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, అదనపు పీడీ ప్రభావతి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మేము బీసీ వర్గానికి చెందినవాళ్లం. కల్యాణమస్తు కింద నాకు ప్రభుత్వం నుంచి రూ.50వేలు అందింది. మాలాంటి పేద అమ్మాయిల పెళ్లి ఖర్చులకు ఆర్థిక సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయన పరిపాలన కలకాలం సాగాలని కోరుకుంటున్నాం.
– లావణ్య, లబ్ధిదారు, తిరుపతి

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. పేద బీసీ కుటుంబానికి చెందిన నాకు కల్యాణమస్తు కింద రూ.50వేలు అందించారు. ఆడబిడ్డలను లక్కచెల్లెమ్మలుగా భావించే ముఖ్యమంత్రి మనకు దొరకడం అదృష్టం. పెళ్లి సమయంలో మమ్మల్ని ఆదుకున్నారు.
– దేవి, లబ్ధిదారు , తిరుపతి

సాయం చేయడం సంతోషం



పేద కుటుంబాల్లో వివాహాలకు ప్రభుత్వం సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాకు ప్రభుత్వం రూ.లక్ష అందించింది. పెళ్లి ఖర్చులకు ఇబ్బందిపడకుండా అండగా నిలిచింది. ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న పథకాలు అభినందనీయం.
– సంధ్య, లబ్ధిదారుల, చిగురువాడ ఎస్సీ కాలనీ

కాలభైరవునికి స్వర్ణ కవచం



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్వర్ణ కవచం అందిస్తున్న దాత సీతారామ్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని కాలభైరవస్వామికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సీతారామ్‌రెడ్డి అనే దాత రూ.7లక్షలు విలువైన స్వర్ణ కవచాన్ని వితరణగా అందించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతకు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి, పాలకమండలి సభ్యులు మున్నా పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం దారుణమయా!

పేదల పాలిట పెద్దాస్పత్రి.. రాయలసీమకే తలమానికంగా ప్రసిద్ధి.. దశాబ్దాలుగా ఘనమైన చరిత్ర రుయా సొంతం. అయితే పర్యవేక్షణలోపంతో కీర్తి మసకబారుతోంది. పట్టించుకునేవారు లేక ప్రతిష్ట దిగజారుతోంది. ముఖ్యంగా ఆస్పత్రిలో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా తయారైంది. అడుగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యంగా మారింది. కాంట్రాక్టర్ అందిస్తున్న మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం జోగుతోంది. దీంతో రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. చికిత్స సంగతి దేవుడెరుగు.. మరిన్ని రోగాల బారిన పడతామేమో అని ఆందోళన చెందుతున్నారు.

- రుయా ఆస్పత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం
- పారిశుద్ధ్య కార్మికుల పేరుతో దోపిడీకి తెరతీసిన కాంట్రాక్టర్
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రోగులు




చెత్తను తరలించకపోవడంతో నిండిపోయిన డస్ట్‌బిన్, అధ్వానంగా మరుగుదొడ్డి



ఆస్పత్రి ప్రాంగణంలో పడేసిన బయోవేస్ట్

తిరుపతి తుడా : తిరుపతి నగరంలోని రుయా ఆస్పత్రి 1,100 బెడ్ల సామర్థ్యంతో సేవలందిస్తోంది. నిత్యం వందలాది మంది రోగులకు చికిత్సలందిస్తోంది. అయితే ఇక్కడ పారిశుద్ధ్యం నిర్వహణ మాత్రం పూర్తిగా పడకేసింది. ఆస్పత్రితో పాటు పరిసరాల్లో సైతం దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి రోజూ పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు.

ఏటా రూ.6.6 కోట్లు

రుయా ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.55లక్షలు వెచ్చిస్తోంది. ఏడాదికి రూ.6.6కోట్లు ఖర్చు పెడుతోంది. ఈ మేరకు ఓ కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో 204 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. వీరికి రూ.13,800 చొప్పున వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎంతమంది కార్మికులు విధులకు వచ్చారు అనే విషయాన్ని వార్డుల వారీగా రుయా సూపరింటెండెంట్, సీఎఆర్ఎస్ఓ, ఆస్పత్రి అడ్మిన్ పర్యవేక్షిస్తుండాలి. పారిశుద్ధ్య నిర్వహణ మేరకు మార్కులు వేయాలి. వాటి ఆధారంగానే కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరవుతాయి. 95కు పైగా మార్కులు వేస్తే పూర్తిస్థాయిలో బిల్లు పెట్టుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఆయా అధికారులు తమ విధులు విస్మరించి నెలాఖరులో వచ్చే బిల్లులపై గుడ్డిగా సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేతన బిల్లులో 10 శాతం తీసుకుని మంచి మార్కులు వేసేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎఫ్ఆర్ఎస్‌కే మస్కా :

ఉద్యోగులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజ్‌డ్ సిస్టమ్)ను తీసుకొచ్చింది. అయితే కాంట్రాక్టర్ ఏకంగా ఎఫ్ఆర్ఎస్‌కే మస్కా కొట్టిస్తున్నాడు. ప్రతిరోజూ విధుల సమయాల్లో ఎఫ్ఆర్ఎస్ వేయించేందుకు కొంతమందిని ఏర్పాటు చేయించాడు. వీరు రోజూ రెండుమార్లు ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతుంటారు. ఇందుకోసం వారికి ప్రతినెలా రూ.2 నుంచి రూ.3 వేల వరకు ముట్టజెపుతున్నారు. ఇలా అక్రమంగా ఎఫ్ఆర్ఎస్ వేయించేందుకు సుమారు 70 మంది వరకు బయట వ్యక్తులు ఉన్నారనే విమర్శలు ఆస్పత్రి సిబ్బంది బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. రుయాలో ఇది వరకు పనిచేసిన సూపరింటెండెంట్ ఇలాంటి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు పట్టించుకునే వారు లేకపోవడంతో ఈ అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విధులకు సంబంధంలేని ఆ 70 మందితో ఎఫ్ఆర్ఎస్ వేయించి ప్రతినెలా వేతనాలను కాంట్రాక్టర్ తన జేబులో వేసేసుకుంటున్నాడు. తమ వాటా తమకు వస్తుండడంతో అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రికి వచ్చిన రోగులు మాత్రం పారిశుద్ధ్య సమస్య కారణంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మరుగుదొడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. సకాలంలో వాటిని శుభ్రం చేయకపోవడంతో రోగులు, వారి సహాయకులు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బయోవేస్ట్

రోగులకు ఉపయోగించిన సిరంజి, సెలైన్ బాటిళ్లు, ఇంజెక్షన్లు, నీడిల్స్, కాటన్ వంటి ప్రమాదకరమైన బయో మెడికల్ వేస్ట్‌ను నిబంధనల మేరకు ఏజెన్సీలకు అప్పగించాలి. అలా సేకరించిన బయో వేస్ట్‌ను జనావాసాలకు దూరంగా యంత్రాల ద్వారా బర్న్ చేయాల్సి ఉంది. అయితే రుయాలో ఈ నిబంధనలు అమలుకావడం లేదు. బయోవేస్ట్‌ను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. ఆస్పత్రిలో ఏ మూలన చూసినా బయో వేస్ట్ కనిపిస్తోంది. ఒక్కోసారి రుయా ప్రాంగణంలోనే బయో వేస్ట్‌ను కాలుస్తున్నారు. దీనివల్ల వచ్చే అనర్థాలను తెలిసి కూడా అధికారులు అలసత్వం వహిస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,430
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,696

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.79,200
రిటైల్ వెండి గ్రాము	రూ.81.20

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తిరుమల : తిరుమలలోని హెక్టా కాంప్లెక్స్ వద్ద ఈ నెల 1వ తేదీన ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాలాజీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని సుధాకర్ తమ వ్యాపారం సక్రమంగా సాగకపోవడానికి ఎదురుగా ఉన్న కుప్పయ్య హోటల్ కారణమని భావించాడు. కుప్పయ్యను చంపేస్తే తన హోటల్ వ్యాపారం పుంజుకుంటుందని పథకం వేశాడు. ఈ మేరకు తన బావమరిది సతీష్‌రెడ్డితో కలిసి దినేష్, వంశీ, హరి, వెంకటేష్, హుసేన్‌బాషాతో రూ.1.85లక్షలకు సుపారీ మాట్లాడాడు. అనంతరం పథకం ప్రకారం కుప్పయ్యను కడతేర్చేందుకు బాలాజీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద కాపుకాశారు. అదే సమయంలో కుప్పయ్య డ్రైవర్ పద్మనాభం అక్కడకు వచ్చి నిందితులతో గొడవపడ్డాడు. దీంతో వారు కత్తులతో పద్మనాభంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, పరారయ్యారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నిందితులు తిరుమల, పాలికాళ్ల గంగమ్మ గుడి వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



సురేఖకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రామనారాయణ

తిరుపతి తుడా: తిరుపతి నెహ్రూనగర్‌కు చెందిన ఆర్.సురేఖ డయాలసిస్ బాధితురాలు. ఆమె బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సెక్రటరీ రామనారాయణ శుక్రవారం బెంగళూరు వెళ్లి బాధితురాలికి రూ.10 వేల పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

గుప్తనిధుల కోసం చంద్రగిరి కోటలో తవ్వకాలు

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు
- పరికరాలు స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న చంద్రగిరి పోలీసులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి కోటలో గుప్తనిధుల కోసం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఓబులేసు తెలిపారు. చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. శ్రీకృష్ణదేవరాయుల మూడో రాజధానిగా ప్రసిద్ధికెక్కిన చంద్రగిరి దుర్గం కొండపై 15 అడుగుల లోతులో గుప్త నిధులు ఉన్నాయని మహబూబ్‌బాషా అనే వ్యక్తి అంజనం వేసి గుప్తనిధుల దొంగలకు చెప్పారన్నారు. దీంతో చంద్రగిరి మండలం, కూచువారిపల్లికు చెందిన నరేంద్ర, తిరుపతి కొర్లగుంటకు చెందిన మహమ్మద్ రఫీ, సోమల మండలం, గట్టువారిపల్లికు చెందిన వెంకటరమణ, గురుకొనవారిపల్లికు చెందిన గుర్రప్ప, చిత్తూరు సంతపేటకు చెందిన జగన్నాథం కుమార్, చిత్తూరు టౌన్‌కు చెందిన దొరస్వామి, రామచంద్రపురం మండలం, కొత్త వేపకుప్పంకు చెందిన నల్లయ్య గ్యాంగ్‌గా ఏర్పడి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించామన్నారు. తవ్వకాలు జరిపేటప్పుడు బండ వస్తే నల్లమందుతో పేల్చేందుకు అక్రమంగా పేలుడు పదార్థాలను సైతం వెంట తెచ్చుకున్నట్లు వివరించారు. బ్యాటరీ, ఎలక్ట్రికల్ వైరు, పవర్ బాక్స్, నల్లముందు, డ్రిల్లింగ్ మిషన్, డ్రిల్లింగ్ రాడ్స్, మైక్రోటెక్ యూపీఎస్ ఇన్వెటర్, ఐరన్ రాడ్స్, ఇన్సోవా బ్యాటరీ, కేబుల్ వైర్, ఎలక్ట్రికల్ వైర్ తదితర వస్తువులు తమ వెంట తెచ్చుకొని గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈనేపథ్యంలో ముకుమ్మడిగా దాడులు చేశామని, నిందితులు వస్తువులను పడేసి పారిపోవడానికి ప్రయత్నించగా చాకచక్యంగా వారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. అంజనం వేసి దుర్గం కొండపై నిధులు ఉన్నాయని చెప్పిన మహబూబ్ బాషా పరారీలో ఉన్నాడన్నారు. సమావేశంలో చంద్రగిరి ఎస్ఐలు వంశీధర్, హిమబిందు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు





ఘటనాస్థలంలో మృతదేహం, దయాసాగర్‌రెడ్డి, మధుమతి, సూర్యతేజ, మౌనికరెడ్డి (ఫైల్)

శ్రీకాళహస్తి: దైవదర్శనానికి వెళ్లి వస్తూ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణంపాలైన ఘటన శుక్రవారం తిరువణ్ణామలైలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌సీపీ గురుకులం సమీపంలో ఒరుగు దయాసాగర్‌రెడ్డి(58), మధుమతి(53) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు డాక్టర్ సూర్యతేజరెడ్డి(33) ఉన్నారు. ఇతనికి డాక్టర్ మౌనికరెడ్డి(29)తో ఏడాది క్రితం వివాహమైంది. గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా కారులో తిరువణ్ణామలైకు వెళ్లారు. గిరిప్రదక్షిణలో పాల్గొని శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. అదేసమయంలో వేలూరు జిల్లా, ఒడుగత్తూరు నుంచి వస్తున్న మినీ వ్యాన్ కన్నమంగళం వద్ద కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న దయాసాగర్‌రెడ్డి, డాక్టర్ సూర్యతేజరెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. డాక్టర్ మౌనిక, మధుమితతోపాటు మినీవ్యాన్‌లో వస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డాక్టర్ మౌనిక మృతిచెందింది. మధుమతి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా సూర్యతేజ చిత్తూరు అపోలో ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తుండగా.. అతని భార్య మౌనికరెడ్డి విజయనగరంలో హౌస్ సర్జన్. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

నిరంతరం అందుబాటులో ఉంటా



పూలు చల్లి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకున్న మహిళలు

- వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి
- నెల్లుట్లవారిపల్లెలో గడప గడపకూ మహా పాదయాత్ర



తేనీరు పంపిణీ చేస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట: నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీలోని వంగుమళ్లవారిపల్లె, బద్దలవారిపల్లె, దిగువ,ఎగువపూజారివాండ్లపల్లె, ఎగువ, దిగువ గుంతాటివారిపల్లెలు, నెల్లుట్లవారిపల్లె, మట్లివారిపల్లె, ఉలవపాటివారిపల్లె, బోమ్మాయి చెరువుపల్లె, హరిజనవాడలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, కరోనా కాలంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన పనులను వివరించారు. తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అడుగు జాడల్లో నడుస్తూ కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకుంటానని పేర్కొన్నారు. నెల్లుట్లవారిపల్లె పంచాయతీలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.1.20 కోట్లతో రోడ్లు వేసినట్టు తెలిపారు. తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ గ్రామాలను కలుపుతూ రూ.5 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శశిప్రియ, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి,, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, వైస్ సర్పంచ్ రజనీ, ఎంపీటీసీ అమరావతి, సచివాలయ కన్వీనర్ వెంకట్రామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, టిల్లు, సుబ్బయ్య, బాబు, సూర్యప్రకాష్‌రెడ్డి, నరసింహారెడ్డి, దినేష్‌రెడ్డి, నరసింహులు, బెల్లంకొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు శనివారం నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక ధ్యాన మందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. అన్నమాచార్య కళామందిరంలో శనివారం ఉదయం 9 గంటలకు సప్తగిరి గోష్టిగానం, సాయంత్రం 6 గంటలకు సంగీత సభ జరుగనుంది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు, సాయంత్రం 6 గంటలకు ప్రముఖ విద్యాంసుల గాత్ర, వాద్య కచేరితోపాటు నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

డీఎల్‌ఓగా న్యాయమూర్తి వీర్రాజు



తిరుపతి లీగల్ : టీటీడీ లా ఆఫీసర్ (డీఎల్‌వో)గా తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏడాది కాలం పాటు ఆయన డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించనున్నారు. దీనిపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

రుయాలో స్టాఫ్ నర్సుల ఆందోళన

- పరిపాలనాధికారి తీరుపై నిరసన



రుయా పరిపాలన అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రిలో పరిపాలన అధికారి తీరుపై స్టాఫ్ నర్సులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సూపరింటెండెంట్ నాగమునీంద్రుడు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వీక్లీ ఆఫ్ మంజూరుకు తప్పనిసరిగా తన అనుమతి తీసుకోవాలని రుయా పరిపాలన అధికారి హుకుం జారీ చేశారని నర్సులు మండిపడ్డారు. నర్సింగ్ సూపరింటెండెంట్ల మధ్య పరిపాలన అధికారి విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఏఎన్ఎం, ఎఫ్ఎం విధులను సైతం స్టాఫ్ నర్సులు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, ఏదైనా సమస్యలు చెప్పుకునేందుకు వెళితే ఇష్టానుసారం మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇబ్బందులకు గురి చేస్తున్న రుయా పరిపాలన అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్టాఫ్ నర్స్ అసోసియేషన్ ప్రతినిధి భువనేశ్వరి వివరించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సంతకాలు సేకరించారు. వేధింపులు మానకపోతే పూర్తిగా విధులను బహిష్కరించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ముగిసిన ఉత్కర్ష మహోత్సవం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మహామహోపాధ్యాయ సాధు భద్రేశ దాస స్వామి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహించిన ఉత్కర్ష మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి న్యూఢిల్లీలోని అక్షర పురుషోత్తమ స్వామి నారాయణ సంప్రదాయ సంస్థ ప్రముఖ ఆచార్యులు మహామహోపాధ్యాయ శ్రీశ్రీశ్రీ సాధు భద్రేశ దాస స్వామి విచ్చేశారు. సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ వీఆర్.పంచముఖి అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అనుగ్రహ భాషణం అందించారు. స్వామి మాట్లాడుతూ తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంతో అక్షర పురుషోత్తమ స్వామి నారాయణ సంస్థ తత్వశాస్త్రాలకు సంబంధించి ఎంఏ స్థాయిలో కొత్త కోర్సును ప్రవేశపెట్టబోతోందన్నారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆంగ్ల వైదేశిక భాషా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఈ.సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవ ప్రదమైనదని వివరించారు. అనంతరం తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి ప్రచురించిన ఉత్కర్ష దీపిక - శోధ పత్రాల సంగ్రహం, భారతీయ దర్శన ధార, కుమార సంభవ కావ్యం సరళ వ్యాఖ్యానం, యాస్క మహర్షి -నిర్వచన విజ్ఞానం, న్యూఢిల్లీలోని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి ప్రచురితమైన మీమాంసా భాష్యం 1,2,3,4 భాగాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కర్నల్ వెంకటేశ్వరన్, డెప్యూటీ రిజిస్ట్రార్ వైవీ.కృష్ణారావు, పీఆర్ఓ ప్రొఫెసర్ సీ.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.